


# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక





కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 బుధవారం 02-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04


## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

సభలో బోరున విలపించిన కవిత



- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు - మిగతా 2 లో

## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



- వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్
- కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి - మిగతా 2 లో

## పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

# కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్

- మూసారాంబాగ్ వద్ద కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించామన్న సీఎం
- కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని తీవ్ర ఆరోపణ
- ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని వెల్లడి




గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## బిష్కెక్‌లో ప్రధాని మోదీకి ప్రవాస భారతీయుల ఘన స్వాగతం

- ఎస్‌సీఓ సదస్సు కోసం కిర్గిస్థాన్ చేరుకున్న ప్రధాని మోదీ
- బిష్కెక్‌లో ప్రవాస భారతీయుల నుంచి ఘన స్వాగతం
- 'భారత్ మాతా కీ జై' నినాదాలతో హోరెత్తిన పరిసరాలు
- రెండు రోజుల పాటు పలు ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొననున్న ప్రధాని
- భద్రత, కనెక్టివిటీ, అవకాశాలే లక్ష్యంగా భారత్ ముందుకు




షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 26వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కిర్గిస్థాన్ చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి రాజధాని బిష్కెక్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా అక్కడి ప్రవాస

## లారక్ ద్వీపంపై అమెరికా డ్రోన్ దాడులు

ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్

- ఇరాన్‌లోని లారక్ ద్వీపంపై అమెరికా సైనిక దాడి
- రెండు ఇరానియన్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు వెల్లడి
- సముద్రంలో మైన్స్ పెట్టేందుకు ఇరాన్ యత్నించిందని ఆరోపణ
- దాడిలో పలువురు మృతి, ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్
- హర్మూజ్ జలసంధిలో పెరిగిన తీవ్ర ఉద్రిక్తత




## బెంగళూరు వచ్చి బాధితులతో మాట్లాడండి

రాహుల్‌కు కుమారస్వామి సవాల్



- కేపీఎస్సీ నియామకాల కుంభకోణంపై రాహుల్ గాంధీ మౌనాన్ని ప్రశ్నించిన కుమారస్వామి
- కోట్లాది రూపాయలకు పోస్టులు అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణలు
- ప్రశ్నపత్రాలను రిసార్టులకు తీసుకెళ్లి అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారని వ్యాఖ్య
- బెంగళూరు వచ్చి బాధితులతో చర్చించాలని రాహుల్ గాంధీకి సవాల్ - మిగతా 2 లో

## భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్.. 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం

- పర్యాటకం, వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉజ్బెకిస్థాన్ నిర్ణయం
- గతేడాది తొలిసారి 1 బిలియన్ డాలర్లు దాటిన ద్వైపాక్షిక వాణిజ్యం
- భారత్ తమకు నమ్మకమైన భాగస్వామి అని చెప్పిన ఆ దేశ అధ్యక్షుడు
- ప్రధాని మోదీ తాష్కెంట్ పర్యటనలో వెలువడిన ఈ కీలక ప్రకటన



భారత పౌరులకు ఉజ్బెకిస్థాన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. భారతీయులకు 30 రోజుల పాటు వీసా రహిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపార సంబంధాలు, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కీలక - మిగతా 2 లో

## నేపాల్ విపత్తుకు కారణం ఇదే.. డ్రోన్ వీడియోలో రికార్డైన భయానక దృశ్యాలు!

- నేపాల్‌లో కుప్పకూలిన భారీ హిమానీనదం
- డ్రోన్ వీడియోలో రికార్డైన ప్రళయ దృశ్యాలు
- వరదల కారణంగా నేపాల్, టిబెట్‌లో వందల మంది మృతి
- వేలాది మంది గల్లంతు, కొనసాగుతున్న సహాయక చర్యలు
- హిమాలయాల్లో పెరుగుతున్న ప్రమాదాలకు ఇదో సంకేతమన్న నిపుణులు




హిమాలయ పర్వతశ్రేణుల్లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ శిఖరం వద్ద ఓ భారీ హిమానీనదం, దాని కింద ఉన్న రాతి పొరలు సహా కుప్పకూలింది. ఈ ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు డ్రోన్ కెమెరాలో రికార్డయ్యాయి. - మిగతా 2 లో

## ఆ ప్రమాద మృతుల కుటుంబాలకు

# రూ.10 లక్షల చొప్పున సాయం

- చిలకలూరిపేట రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం
- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ
- ఈ నెల 27న ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొట్టిన ఘటన
- ఒకే గ్రామానికి చెందిన 8 మంది మృతి చెందిన విషాదం




పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున




## ఎల్ఐసి నుండి రెండు కొత్త ప్లాన్లు.

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ రెండు కొత్త ప్లాన్లను లాంచ్ చేసింది. ఎల్ఐసీ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బీమా ప్లాటినమ్, జీవన్ రక్ష పేరిట రెండు కొత్త ప్లాన్లను ప్రకటించింది. సెప్టెంబర్ 7 నుంచి ఈ పాలసీలు అందుబాటులోకి రానున్నాయి.

# బిష్కెక్‌లో ప్రధాని మోదీకి ప్రవాస భారతీయుల ఘన స్వాగతం

మొదటిపేజీ తరువాయి – భారతీయులు ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికారు. విమానాశ్రయం నుంచి హోటల్‌కు చేరుకున్న ప్రధాని మోదీని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రవాస భారతీయులు తరలివచ్చారు. ‘భారత్ మాతా కీ జై’, ‘వందే మాతరం’ వంటి నినాదాలతో ఆ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా కొందరు యోగా ఆసనాలను ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విశేష ఆదరణపై ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ, “భారత్ నుంచి బిష్కెక్ వరకు.. ఈ సాయంత్రం భారత సమాజం అందించిన స్వాగతం అత్యంత ప్రత్యేకమైనది” అని పేర్కొన్నారు. అంతకుముందు మానస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కిర్గిస్థాన్ క్యాబినెట్ ఆఫ్ మినిస్టర్స్ ఛైర్మన్ ఆదిల్‌బెక్ కాసిమాలియేవ్ ప్రధానికి అధికారికంగా స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనడంతో పాటు పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు మోదీ వెల్లడించారు. పర్యటనకు బయలుదేరే ముందు ఆయన మాట్లాడుతూ.. భద్రత, కనెక్టివిటీ, అభివృద్ధి అవకాశాల ప్రాతిపదికన ఈ ప్రాంతంలో భారత్ తన దార్శనికతను ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం లేని ప్రాంతం కోసం సభ్య దేశాలతో సమన్వయంతో పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. తన పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకలకు ఆయన హాజరుకానున్నారు. ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని కిర్గిస్థాన్ ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# బెంగళూరు వచ్చి బాధితులతో మాట్లాడండి

మొదటిపేజీ తరువాయి – కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్సీ) నియామకాల కుంభకోణంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి విమర్శించారు. ఈ వ్యవహారంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. నిన్న బెంగళూరులోని జేడీఎస్ ప్రధాన కార్యాలయం ‘జేపీ భవన్’లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి.. “మీరు ఎక్కడున్నారు? ఇక్కడ కేపీఎస్సీ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పడుతోంది. దేశమంతా పర్యటిస్తూ విద్యార్థులు, యువతతో ముచ్చటించే మీరు.. బెంగళూరుకు ఎప్పుడు వచ్చి కేపీఎస్సీ బాధితుల సమస్యలపై చర్చిస్తారు?” అని నిలదీశారు. ఈ కుంభకోణంలో కోట్లాది రూపాయలకు పోస్టులను అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. “ప్రశ్నపత్రాలను రిసార్టులకు తరలించి, డబ్బు చెల్లించిన అభ్యర్థులకు ముందే అందజేశారు. సమాధానాలు ఎలా రాయాలో కూడా వారికి అక్కడ శిక్షణ ఇచ్చారు” అని కుమారస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో బెంగళూరు అభివృద్ధి ప్రాధికార సంస్థ (బీడీఏ)లో వివాదాస్పద రికార్డు ఉన్న వ్యక్తిని కేపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించారని ఆయన విమర్శించారు. సొంత శాఖలోని సమస్యలను పట్టించుకోకుండా, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు చేయడంపై ఆయన ఎద్దేవా చేశారు. ఈ స్కామ్ కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అరెస్టు అయిన నేపథ్యంలో కుమారస్వామి విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తక్షణమే రాహుల్ గాంధీ బెంగళూరుకు వచ్చి బాధితులతో ముఖాముఖి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు.

# ఆ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం

మొదటిపేజీ తరువాయి – ఆర్థిక సాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన చిలకలూరిపేట సమీపంలో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిలకలూరిపేట మండలం, వేలూరు గ్రామానికి చెందినవారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్

మొదటిపేజీ తరువాయి – వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే. నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, “ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి” అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. “2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!” అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

# రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

మొదటిపేజీ తరువాయి – రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి – రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్.. 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి – నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీతో ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ జరిపిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ప్రధాని మోదీతో భేటీ సందర్భంగా మిర్జియోయెవ్ మాట్లాడుతూ.. భారత్ తమకు ‘నమ్మకమైన వ్యూహాత్మక భాగస్వామి’ అని అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. “గతేడాది తొలిసారిగా మన ద్వైపాక్షిక వాణిజ్యం 1 బిలియన్ డాలర్ల మార్కును దాటింది. గత కొన్నేళ్లుగా ఇరు దేశాల సంయుక్త సంస్థల సంఖ్య ఏడు రెట్లు పెరిగింది. ప్రస్తుతం భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య వారానికి 14 ప్రత్యక్ష విమాన సర్వీసులు నడుస్తున్నాయి” అని ఆయన వివరించారు. ఈ వీసా ఫ్రీ నిర్ణయంతో భారత పర్యాటకులు, వ్యాపారులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. కేవలం రాజకీయ, దౌత్యపరమైన సంబంధాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక బంధాన్ని కూడా పటిష్ఠం చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్, మహాత్మా గాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ స్టడీస్ వంటి సంస్థలు సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతున్నాయని మిర్జియోయెవ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఉజ్బెకిస్థాన్‌లో యోగాకు విశేష ఆదరణ లభిస్తోందని, 2018లోనే ప్రత్యేకంగా యోగా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1992 మార్చి 18న భారత్‌తో దౌత్య సంబంధాలు ప్రారంభమయ్యాయి. 2011లో ఈ బంధం వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారింది. ప్రధాని మోదీ 2015 తర్వాత ఉజ్బెకిస్థాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన పర్యటన ముగించుకున్న అనంతరం మోదీ, కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 26వ షాంఘై సహకార సంస్థ (రాజా) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బిష్కెక్‌కు చేరుకున్నారు.

# లారక్ ద్వీపంపై అమెరికా డ్రోన్ దాడులు



మొదటిపేజీ తరువాయి – అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన లారక్ ద్వీపంపై అమెరికా సైనిక దళాలు దాడి చేశాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హార్మూజ్ జలసంధిలో ఇరాన్ సముద్రపు మైన్‌లను అమర్చేందుకు ప్రయత్నించడంతో ఈ దాడి చేసినట్లు అమెరికా ప్రకటించింది. ఈ ఘటనతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికార ప్రతినిధి టిమ్ హాకిన్స్ ఈ దాడిని ధ్రువీకరించారు. “ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) దళాలు.. హార్మూజ్ జలసంధిలోకి సముద్రపు మైన్‌లతో కూడిన రాకెట్లను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు గుర్తించాం. ఈ ప్రాంతాన్ని నిశితంగా గమనిస్తున్నాం. వాణిజ్య నౌకల స్వేచ్ఛా రవాణాను పరిరక్షించడానికి సిద్ధంగా ఉన్నాం” అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడిలో రెండు ఇరానియన్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు. గత నెల రోజుల తర్వాత ఇరాన్ లక్ష్యాలపై అమెరికా దాడి చేయడం ఇదే తొలిసారి. ఈ దాడిని ఐఆర్జీసీ ధ్రువీకరించింది. ఇది ‘అమెరికా-ఇజ్రాయెల్’ ఉమ్మడి దాడి అని ఆరోపించింది. ఈ ఘటనలో పలువురు సైనిక సిబ్బంది, సాధారణ పౌరులు మరణించారని తెలిపింది. దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్ష తప్పదని ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. అమెరికా డ్రోన్ దాడిలో కనీసం ఇద్దరు మరణించి, మరో ఇద్దరు గాయపడినట్లు ఇరాన్‌కు చెందిన అనధికారిక వార్తా సంస్థలు నివేదించాయి. ఇటీవల అమెరికా సైన్యం హార్మూజ్ జలసంధిలోని అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల నుంచి సముద్రపు మైన్‌లను తొలగించింది. ఈ ఆపరేషన్ ముగిసిన కొద్ది రోజులకే ఇరాన్ మళ్లీ మైన్‌లను అమర్చేందుకు సిద్ధమవడంతో అమెరికా ఈ దాడికి దిగింది. సముద్రంలో మైన్‌లను అమర్చడంపై ‘జీరో టాలరెన్స్’ విధానాన్ని అనుసరిస్తున్నామని, అలాంటి ప్రయత్నాలకు పాల్పడే ఏ నౌకనైనా తక్షణమే ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలోనే ఇరాన్‌ను హెచ్చరించారు. తాజా ఘటనతో ఇరు దేశాల మధ్య వైరం మరింత ముదిరినట్లయింది.

# నేపాల్ విపత్తుకు కారణం ఇదే డ్రోన్ వీడియోలో రికార్డైన భయానక దృశ్యాలు!

మొదటిపేజీ తరువాయి – ఈ ఘటన కారణంగానే గత వారం నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో భీకర వరదలు సంభవించి వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. చైనాకు చెందిన ఒక ఫోటోగ్రాఫర్ సుమారు 7,200 మీటర్ల ఎత్తు నుంచి ఈ విపత్తును తన డ్రోన్ కెమెరాలో చిత్రీకరించారు. భారీ మంచు ఫలకం, రాళ్లతో కూడిన పర్వత భాగం ఒక్కసారిగా విరిగిపడటం, ఆ తర్వాత పర్వతాల నుంచి దట్టమైన ధూళి మేఘాలు పైకి లేవడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. విరిగిపడిన భాగం సుమారు 1,200 మీటర్ల దిగువన ఉన్న లోయలో పడటంతో మంచు, రాళ్లు, బురదతో కూడిన ఉప్పెన సృష్టించింది. ఈ ప్రళయం కారణంగా ఆగస్టు 26న భోటేకోశి, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ వరదల వల్ల నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో వందలాది మంది మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఎక్కువ మంది నేపాల్‌కు చెందినవారే. ఈ విపత్తు “ఊహకందనిది, హృదయ విదారకమైనది” అని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఆవేదన వ్యక్తం చేశారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల వల్ల నష్టాన్ని అంచనా వేయడం సవాలుగా మారిందని ఆయన తెలిపారు. శాటిలైట్ చిత్రాలు, భూకంప డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు... లాంగ్‌టాంగ్ లిరుంగ్ ఉత్తర భాగంలో భారీ స్థాయిలో మంచు, రాళ్లు విరిగిపడటమే వరదలకు కారణమని తేల్చారు. హిమానీనదం కూలినప్పుడు భూకంప లేఖినిపై 5.2 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయని వెల్లడించారు. హిమాలయాల్లో ఇలాంటి విపత్తులు ఇటీవలి కాలంలో తరచుగా జరుగుతున్నాయని, ఎత్తైన ప్రదేశాల్లోని అస్థిరమైన మంచు, రాళ్ల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# ‘పుట్టింటి నుంచే బయటకు పంపారు’

మొదటిపేజీ తరువాయి – కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. “నాతో ఎందుకు ఇలా చేయాలి?” అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు “కవిత సీఎం.. సీఎం” అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్



మొదటిపేజీ తరువాయి – తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట – మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన ఉద్యోగులను కోరారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్



మొదటిపేజీ తరువాయి – నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. “ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం”గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హార్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. దీంతో అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది. ఈ నిల్వలు 2026 ప్రారంభం నుంచి 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా తగ్గి, 300 మిలియన్ బ్యారెళ్ల దిగువకు పడిపోయాయి. సుమారు 9 నెలల క్రితం అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ కోసం అమెరికాకు తరలించింది. అనంతరం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్, దేశ చమురు రంగాన్ని ప్రైవేటీకరణకు అనుమతిస్తూ చట్టం చేశారు. దశాబ్దాల సోషలిస్ట్ పాలనకు ఇది పూర్తి విరుద్ధం. ఈ మార్పే తాజా ఒప్పందానికి మార్గం సుగమం చేసింది. ఈ ఒప్పందం ద్వారా వెనెజువెలాలోకి 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయని, అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గుతాయని మార్కో రూబియో ‘ఎక్స్’లో పేర్కొన్నారు. అయితే, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాల కారణంగా వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఎంతవరకు ముందుకొస్తాయనేది వేచి చూడాలి. గతంలో ఎక్సాన్‌మొబిల్ సీఈఓ డారెన్ వుడ్స్, వెనెజువెలాను ‘పెట్టుబడులకు అనర్హమైన దేశం’గా అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు (సుమారు 303 బిలియన్ బ్యారెళ్లు) ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాల కొరతతో వెనెజువెలా ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో కేవలం 1% మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.

## ప్రకృతి వ్యవసాయం ఆర్ పి ఎల్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం




**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 1 :** భీమారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ - 2026-27 ఆధ్వర్యంలో "ప్రకృతి వ్యవసాయం (నేచరల్ ఫార్మింగ్ ) - ఆర్ పి ఎల్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం" నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలోఅత్తే సుధాకర్,మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేల సారం పెరగడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతులకు నాణ్యమైన, దిగుబడులు లభిస్తాయని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సిద్ధమైన పద్ధతులను పాటించాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్, భీమారం మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## అమాయక ఆదివాసి బిడ్డ ఊకె శిరీష మృతిపై న్యాయ విచారణ జరపాలి

ఆదివాసి సంఘం నాయకులు

మెండి.భాస్కర్




**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 1: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ప్రైమ్ కేర్ హాస్పిటల్ స్టాఫ్ నర్స్ శిరీష మృతి ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి బాధ్యులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు, నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.యువ స్టాఫ్ నర్స్ మృతి పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఘటనకు దారితీసిన పరిస్థితులను లోతుగా పరిశీలించాలని కోరారు.పోలీసులు దర్యాప్తును కేవలం ప్రాథమిక విచారణకే పరిమితం చేయకుండా పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాలు తదితర అంశాలను పరిశీలించి పూర్తి స్థాయిలో నిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.శిరీష మృతికి అసలు కారణం ఏమిటో ప్రజలకు స్పష్టత వచ్చేలా దర్యాప్తు పారదర్శకంగా సాగాలని అన్నారు.మహిళలు, యువతులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని, మహిళలపై దాడులు, వేధింపులు, హత్యలు వంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేరస్తులకు చట్టపరమైన శిక్ష పడితేనే బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం, భరోసా కల్పించాలని నాయకులు కోరారు. ఘటనపై ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. "శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం.. మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే" అని వారు స్పష్టం చేశారు.


## వసంత శివ నాగేశ్వరరావు కుటుంబానికి రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు సెప్టెంబర్ 1, పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన వసంత శివ నాగేశ్వరరావుకు వైద్య చికిత్స కోసం రూ.4 లక్షల విలువైన ఎల్ఓసీ ను ఆయన సతీమణి శ్రీదేవికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని, వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఎల్ఓసీల ద్వారా అవసరమైన సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎల్ఓసీ అందజేయడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మంచిర్యాల ఆసిఫాబాద్ జిల్లా సర్పంచుల చైతన్య సదస్సు

నూతన జిల్లా కార్యవర్గం ఏర్పాటు.



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 1 :** మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా సర్పంచ్ ల చైతన్య సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింపూల సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల పలు సమస్యల పై, వాటి పరిష్కారాల పై చర్చించటం జరిగింది ఉపసర్పంచ్ ల చెక్ పవర్ రద్దు చేయాలనీ ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ లు అందరూ కలిసి ఏకగ్రీవంగా చెప్పడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో సర్పంచ్ ల నూతన జిల్లా కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గా చెన్నూరి సమ్మయ్య ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ప్రధాన కార్యదర్శి గా పులి రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా దాసరి మణిదీపక్,వంగ రాములు గౌడ్,రాంగిరి రామన్న, భీరయ్య,కుదిరే వెంకన్న కోశాధికారిగా మంత్రి గోపి కృష్ణ ను ఎన్నుకున్నారు.

## నోటీసులు ఇవ్వకుండానే అత్యుత్సాహం ప్రదర్శించి ఇంటి నిర్మాణం కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు




**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు (ఆదర్శనగర్ )లో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారంటు నోటీసులు ఇవ్వకుండానే ఇంటి నిర్మాణం కూలుస్తున్నారని మహిళా ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ... మున్సిపల్ అధికారులు తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే పోలీసుల పర్యవేక్షణలో జేసీబీ లతో అకస్మాత్తుగా విరుచుకుపడి తన ఇంటి నిర్మాణాన్ని కూల్చివేస్తున్నారని అన్నారు. అధికారులు లంచాలకు అలవాటు పడి తనను రెండు లక్షలు డిమాండ్ చేసి దొంగ పర్మిషన్లు ఇవ్వడంతో పై అధికారులకు ఫిర్యాదు చేయగా కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులు అయినటువంటి టిపిఓ రాజేంద్ర ప్రసాద్, అసిస్టెంట్ లింబాద్రిలను సస్పెండ్ చేశారని దానిని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు పోలీసులతో కుమ్మక్కై తన ఇంటి నిర్మాణం కూల్చివేస్తున్నారని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు.కోర్టు పరిధిలో విచారణ కొనసాగుతుండగా తన ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయడం పట్ల బాధితురాలు తప్పుబట్టారు.ఎటువంటి నంబర్ లేని జెసిబి వాహనం ఉపయోగించి అధికారులు ఇల్లును కూలగొట్టడం కోసమెరుపు. మెట్ పల్లి పట్టణంలో అధికారులు లంచాలు తీసుకొని అనేక అక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వగా వాటిని వదిలిపెట్టి పర్మిషన్ ఉన్న తన నిర్మాణాన్ని కూల్చివేస్తున్నారని లబోదిబోమన్నారు.వెంటనే అధికారులను సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలంటూ పై అధికారులను వేడుకుంటున్నట్టు బాధితురాలు తెలిపారు.

## ప్రజాధనానికి లెక్క చెప్పాలి పదవికి రాజీనామా చేయాలి..! కాంగ్రెస్



**భద్రాచలం, సెప్టెంబర్ 1, పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాచలం మండలంలో నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో భారీ బైక్ ర్యాలీ. నిర్వహించారు అనంతరం ప్రజాధనానికి లెక్క చెప్పాలని, ప్రజలకు దూరంగా ఉంటున్న ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమై అంబేద్కర్ సెంటర్, యూబీ రోడ్, నెహ్రూ మార్కెట్, జీసీసీ రోడ్డు మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రతిపక్ష నాయకుడైనా ప్రజలకు దూరంగా ఉంటూ, సుమారు 1000 రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం విఫలమైతే ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడే ప్రజలకు దూరంగా ఉంటే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఏమిటని నిలదీశారు. గత మూడు సంవత్సరాలుగా ప్రజల సొమ్ము రూ.22 కోట్ల 24 లక్షల 40 వేల మొత్తాన్ని తీసుకుంటూ ప్రజలకు ముఖం చూపించని వ్యక్తి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని తెలిపారు.

**భద్రాచలంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ప్రదర్శన**

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు , కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో యూత్ తదితరులు పాల్గొన్నారు.

## సాగులో చీడ పీడల యాజమాన్య పద్ధతుల పై అవగాహన

మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండలం సెప్టెంబర్ 01 మంగళవారం పోత్కపల్లి రైతు వేదిక యందు ఆత్మ ఆధ్వర్యంలో ఆర్ పి ఎల్ శిక్షణ లో భాగంగా సమీకృత వ్యవసాయం నూతన సాగు పద్ధతులు మరియు వానకాలం పంటలపై వచ్చే చీడపీడల నివారణపై అవగాహన కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు కునారం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చంద్ర మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రస్తుతం ప్రధాన పంటలైన వరి పత్తి, మొక్కజొన్న పంటలలో తీసుకోవాల్సిన ఎరువులు ,కలుపు యాజమాన్యం చీడపీడల నివారణ గురించి పలు సూచనలు అందజేశారు అదేవిధంగా ఈ కార్యక్రమం కి విచ్చేసిన తెలంగాణ విజ్ఞాన కేంద్రం పెద్దపెల్లి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సంపత్ మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు ఆరుతడి పంటల వల్ల కలిగే లాభాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త లు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో మోగి పురుగు సమస్య కనబడుతుందని దీని నివారణకు కార్ టాప్ ఏడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరానికి లేదా క్లోరాంత్రి 600 మిల్లీలీటర్లు ఎకరానికి లేదా ఐసోసైక్లోసిరం 128 మిల్లీలీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి అదేవిధంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెట్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటర్ నీటికి లేదా స్పైనటోరం 0.5 ఎం ఎల్ లీటర్ నీటికి లేదా క్లోరాంతర నీలిప్రోలు 0.4 మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి పత్తిలో పచ్చ దోమ నివారణకు లోని కామెంట్ 0.3 గ్రాములు లీటర్ నీటికి లేదా ఇమిడా క్లోపరేట్ 0.25 ఎం ఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ సర్పంచ్ అంబాలసారమ్మ అలాగే సింగిల్ విండో చైర్మన్ సుమన్ రెడ్డి ఏ ఈ ఓ లు మౌనిక కిరణ్ రైతులు పాల్గొన్నారు

## భీమారం లో ఎల్ఐసి 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 1 :** భీమారంలో భారతీయ జీవిత బీమా సంస్థ ( ఎల్ఐసి ) 70వ ఆవిర్భావ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భీమారం మండలంలోని రేశవేని శ్రీనివాస్ పాలసీ దారుల సేవ కేంద్రం లో కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పుష్క మల్ల విజయలక్ష్మి పున్నం చంద్ , తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జ్ ముక్త సంతోష్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి ఎల్ఐసి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 70 సంవత్సరాలుగా భారతీయ జీవిత బీమా సంస్థ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, కోట్లాది కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పిస్తూ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాలసీదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రూ.75 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాయం



**మణుగూరు సెప్టెంబర్ 1.పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, వినాయక నగర్ ప్రాంతాల్లో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం శంకుస్థాపన చేశారు. సుందరయ్య నగర్‌లో రూ.44 లక్షల వ్యయంతో, వినాయక నగర్‌లో రూ.31 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. మొత్తం రూ.75 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, ఏఈ, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆర్అండ్‌బీ శాఖకు చెందిన అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి



**పోరు తెలంగాణ న్యూస్ తానుర్ ప్రతినిధి సెప్టెంబర్ 1 :** తాండూర్ మండలంలోని గ్రామపంచాయతీ లో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను తాను ర్ సర్పంచ్ సుగంధ మాధవ్ రావు పటేల్ ప్రజలకు అందజేశారు, కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనుల్లో ఇది ఒక భాగం అని చెప్పారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫరూక్ అలీ, వార్డు సభ్యులు సాయినాథ్ పవర్, సయ్యద్ వాజిద్, తో పాటు అలీ ఖాన్ అక్బర్ ఖాన్ గజానంద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి,జీపీఓ, తేజ,రవి, డీలర్ మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు,

## మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్..



**మహేశ్వరం, సెప్టెంబర్ 1,పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** హర్షగూడ గ్రామానికి చెందిన పాల్త్య రూప్లీ భాయి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్ రూప్లీ బాయి కుటుంబానికి 7 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. మృతురాలి కుటుంబానికి శాంతి చేకూరాలని ఆయన కోరుకున్నాడు.

## రక్షాబంధన్ వేడుకలలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్



**మహేశ్వరం, సెప్టెంబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్ రక్షాబంధన్ వేడుకలలో పాల్గొన్నారు. ఆయన అక్కచెల్లెళు రాఖీని కట్టి అన్నాచెల్లెల అనుబంధాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ అక్క చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని ఆయన అన్నారు.

# ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం



మండల యూత్ అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ రాష్ట్ర హరిత మిత్ర అవార్డు గ్రహీత దాసరి మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 హామీలపై ప్రెస్‌మీట్ నిర్వహించారు ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు మహిళలకు నెలకు రు " 2500/- హామీ 33 నెలలకు రు "82500/- వృద్ధులకు /బీడీ కార్మికులకు పెన్షన్ నెలకు రు" 4000/- హామీ 33నెలలకు రు"66,000/-హామీ ,దివ్యంగులకు పెన్షన్ నెలకు రు"6000/- హామీ 33 నెలలకు రు"66000/- బాకీ కల్యాణలక్ష్మి /షాదీ ముబారక్ ఆడబిడ్డల పెళ్లిలకు తులం బంగారం విద్యార్థినులకు స్కూటీ బాకీ ,పీజు రియింబర్స్ మెంట్ కాలేజీ విద్యార్థుల పీజు బకాయిలు రు"12,000 కోట్లు బాకీ రైతు భోరోసా 4ఎకరాల రైతుకు రు "1,02,000/- బాకీ రుణమాపి రు"2,00,000/- బాకీ , వరి పంటలకు 500 బోనస్ ప్రతి ఎకరాకు రు"12,500 హామీ ఆరు పంటలకు ప్రతి ఎకరాకు రు"75,000/- బాకి ,,రైతు కూలీలకు (ఉపాధి హామీ)సంవస్సరానికి రు"12,000/-హామీ 2 సంవస్సరాలకు రు"24,000/-బాకీ ,నిరుద్యోగ భృతి 33 నెలలకు రు"1,32,000/- బాకీ,విద్య భరోసా కార్డు విద్యార్థులకు రు"5,00,000/- బాకీ ,ఆటో కార్మికులకు సంవత్సరానికి రు"12,000/- హామీ 2 సంవస్సరాలకు రు "24,000/- బాకీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్,ఓదెల గ్రామ అధ్యక్షులు పోలోజు రమేష్,రౌతు జలపతి,గుండేటి మధు,శ్రీనివాస్,తీర్థల కుమార్,బోడకుంట నరేష్,చింతం మొగిలి,గడ్డం శ్యామ్ కుమార్,బోయ సదానందం,తుడి సంపత్ రాజు,రాచర్ల కుమార్,లడ్డు,పిట్టల అరుణ్,మద్దెల శ్రీను,బినవేణి పరశురాం,రాసాల అశోక్,గిద్దెమారి రమేష్,అంబాల కుమార్,ఎండీ సర్వర్,మోటం అశోక్,రవి, శ్రవణ్ తదితరులు ఉన్నారు

# ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఆకస్మికంగా తనిఖీ : జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం సెప్టెంబర్ ఒకటి పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ - పాల్వంచ, ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ పాఠశాల 15 ఎకరాల విస్తీర్ణంలో 2017 ఏడాదిలో నిర్మించగా గతంలో పాల్వంచ ప్రాంతంలో ఉండగా,ప్రస్తుతం కొత్తగూడెం ప్రాంతానికి తరలించిన ఈ ఏకలవ్య మోడల్ స్కూల్ లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులకు విద్యా తరగతులు, వసతి సౌకర్యాలు అందుతుండగా, ఆ భవన సముదాయాలను, పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలు జిల్లా కలెక్టర్ పాఠశాల ఇన్చార్జి మున్సిపల్ ప్రశంజీత్ భూసాల్ ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టీచింగ్ విభాగంలో 23 రెగ్యులర్ సిబ్బంది, 12 మంది ఔట్సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, నాన్ - టీచింగ్ విభాగంలో ఐదుగురు ఔట్సోర్సింగ్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. 240 మంది బాలికలకు,240 మంది బాలురకు ప్రత్యేక వార్డెన్స్ వేర్వేరుగా ఉన్నారని, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. విజయ గత నెల ఆగస్టు 17వ తేదీ నుంచి సెలవుల్లో ఉన్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పాఠశాల ఆవరణలో ఉన్న డైనింగ్ హాలులో వంట వండుతున్న కుకింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన



వంటకాలను అన్నం, పప్పు, సాంబార్,రసం, పెరుగు, కోడిగుడ్లను, రాత్రి భోజనం కోసం వంట చేసేందుకు సిద్ధం చేసుకున్న కాయగూరలను పరిశీలించి కుకింగ్ చేసే వంట మనిషితో, హెల్పర్లతో మాట్లాడారు. ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారని, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం విద్యార్థులకు సిద్ధం చేసి అందజేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే విద్యార్థులతో పాటు పాఠశాల ఆవరణ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అదేవిధంగా డైనింగ్ హాల్ లో ఉన్న స్టోర్ రూమ్, ఆర్.ఓ.ఆర్ ప్లాంట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ఉన్న కాయగూరలు, ఉల్లిగడ్డ, నిల్వ ఉన్న పప్పు దినుసులు, బియ్యం,సబ్బులు, సరపు, షాంపులు, తదితర సామాగ్రిని ఎప్పుడు కొనుగోలుచేశారని, ఎంతకాలం నుంచి నిల్వ



ఉంచుతారని క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న సుజాత తన సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళింది. విధులు నిర్వహించాలంటే సెక్యూరిటీ రూమ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ రూమ్ నిర్మించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా పాఠశాలకు రావాలంటే విద్యార్థులు,ఉపాధ్యాయ సిబ్బంది సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, అంతర్గత రోడ్లు పరిస్థితి మరీ దారుణమని పలు సమస్యలు జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేయాలి

### జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే నిరాహారదీక్షలు ముగింపు

**మహేశ్వరం, సెప్టెంబర్ 01 పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలను పూర్తిగా విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల రిలే నిరాహారదీక్షలు మంగళవారం ముగిశాయి. ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ నిరసనకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు. జేఏసీ ఛైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. మహేశ్వరం మండలం, పరిధిలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించినవారమవుతామని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుపై కొన్ని రాజకీయ శక్తులు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేసి ఫార్మా సిటీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ ద్వారా ఐటీ, పరిశ్రమలు, విద్య, వైద్యం, స్పోర్ట్స్ సిటీ, విల్లాస్, స్కిల్ యూనివర్సిటీ, రియల్ ఎస్టేట్ రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు



ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రఘుపతి అన్నారు.

**మద్దతు తెలిపిన దేపా భాస్కర్ రెడ్డి**

రిలే నిరాహారదీక్షకు టీపీసీసీ మెంబర్ దేపా భాస్కర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఫార్మా సిటీ వద్దని స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అడ్డుకున్నారని అన్నారు. ప్రస్తుతం అభివృద్ధికి బాటలు వేస్తున్న ఫ్యూచర్ సిటీని చూసి ఓర్వలేకే మహేశ్వరం మండల విలీనాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

**జర్నలిస్టుల సంఘీభావం**

మహేశ్వరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కట్టెకొమ్ముల జగన్ రెడ్డి, టీడబ్ల్యూజెఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు తడాక నర్సింహా ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షకు స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కూడా సంఘీభావం



తెలిపారు. మహేశ్వరం మండలంతో పాటు అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని జేఏసీ డిమాండ్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం నల్గొండ రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహా రావు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షుడు కర్నాటి మనోహర్, ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, సలహాదారు జగన్ రెడ్డి, కాకి ఈశ్వర్ ముదిరాజ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈశ్వర్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోతర్ల సుదర్శన్ యాదవ్, లాజర్, షేక్ హాజీ బాబా, పరిగి రాఘవేందర్ రెడ్డి, విట్టల్ నాయక్, మల్లేష్ ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, కాకి యాదగిరి, కర్రోళ్ల రాములు, దోమ శ్రీనివాసరెడ్డి, హరికృష్ణ ముదిరాజ్, మహమ్మద్ ఇర్షాద్, కాకి మల్లేష్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

# ఎకనామిక్ నేషనల్ కోఆర్డినేటర్‌గా విఠల్ నియామకం

### ఆర్థిక అహింస, శాంతియుత ఆర్థికాభివృద్ధి సేవల కోసం గుర్తింపు

**పోరు తెలంగాణ,ఖమ్మం (సెప్టెంబర్ 1:) :** ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ కోఆర్డినేటర్ (నేషనల్ కౌన్సిల్ గా కొత్తగూడెం పట్టణానికి చెందిన విఠల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డా. సౌరవ్ అగర్వాల్ 24 ఆగస్టు 2026న నియామక పత్రాన్ని జారీ చేశారు. ఎకానమిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒక బహుముఖ, లాభాపేక్షలేని, , స్వతంత్ర సంస్థ అని విఠల్ పేర్కొన్నారు ఆర్థిక సోదరభావం ఆర్థిక అహింసను ప్రోత్సహించేందుకు పనిచేస్తుందని, దానికి కట్టుబడి పని చేయాలని విఠల్ పేర్కొన్నారు. ఆర్థిక, ప్రజా విధానాలు, వ్యాపార ప్రయోజనాల పరిరక్షణ, విధాన చర్చలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, ప్రభుత్వ సంబంధాలు తదితర రంగాల్లో నిపుణుల బృందంతో సంస్థ పనిచేస్తున్నట్లు వివరించారు. విటల్ నీ గౌరవ ప్రాతిపదికన ప్రారంభంగా ఒక సంవత్సరం కాలానికి, తక్షణ ప్రభావంతో లేదా తదుపరి నిర్ణయం తీసుకునే వరకు నేషనల్ కోఆర్డినేటర్‌గా ఆహ్వానిస్తున్నట్లు ఎకానమిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలిపింది. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా శాంతియుత ఆర్థికాభివృద్ధి, సహజీవనం, సహనం, ఆర్థిక అహింస వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లడంలో విటల్ మార్గదర్శకత్వం, సూచనలు, సహకారం అందిస్తారని సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది. అలాగే ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు, బహుళపాక్షిక సంస్థలు, వివిధ సంస్థలు, పౌర సమాజ సంస్థలు, వ్యక్తులతో ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరపున సమన్వయం చేస్తూ సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యతల్లో భాగస్వామ్యం కావాలని డాక్టర్ సౌరవ్ శర్మ పేర్కొన్నారు. ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పేరును దుర్వినియోగం చేయకుండా, తప్పుడు ప్రాతినిధ్యం వహించకుండా, ఎలాంటి ఆర్థిక లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో సంస్థను భాగస్వామ్యం చేయకుండా న్యాయబద్ధమైన ప్రవర్తనను పాటిస్తానని విటల్ పేర్కొన్నారు. విటల్ నియామకంపై పలు ప్రజా సంఘాలు, ఆర్థిక నిపుణులు పలువురు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, కార్పొరేట్, సామాజిక సంస్థలతో సమన్వయం చేస్తూ ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లక్ష్యాల సాధనలో ఆయన కీలక పాత్ర పోషించాలని వారు కోరారు.



# నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి

**పోరు తెలంగాణ న్యూస్ తానూర్ ప్రతినిధి సెప్టెంబర్ 1 :** తానూర్ మండలంలోని గ్రామపంచాయతీ లో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను తాను ర్ సర్పంచ్ సుగంధ మాధవ్ రావు పటేల్ ప్రజలకు అందజేశారు, కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనుల్లో ఇది ఒక భాగం అని చెప్పారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షైక్ ఫరూక్ , వార్డు సభ్యులు సాయినాథ్ పవర్, సయ్యద్ వాజిద్, తో పాటు అలీ ఖాన్ అక్బర్ ఖాన్ గజానంద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి,జీపీఓ, తేజ,రవి, డీలర్ మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు,



# ఐఅండ్ పీఆర్ జేడీ జగన్ కు అడిషనల్ డైరెక్టర్ గా పదోన్నతి

### అభినందనలు తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు




**పోరు తెలంగాణ,హైదరాబాద్, సెప్టెంబర్ 01:** రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన జాయింట్ డైరెక్టర్ డి ఎస్. జగన్ కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి మాసబ్ ట్యాంక్ లోని సమాచార భవన్ (ఐఅండ్ పీఆర్ కార్యాలయం) లో జగన్ ను కలిసి పూలబోకే అందజేసి అభినందనలు తెలియజేశారు. సోమయ్య తో పాటు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.పాండురంగారావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా నాయకులు నంబి పర్వతాలు, గోవింద్ నాయక్, ఎం. రవికుమార్ తదితరులు నూతన అడిషనల్ డైరెక్టర్ జగన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన డిఎస్ జగన్ కు డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

# హెల్మెంట్, నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్: తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ

**పోరు తెలంగాణ, ఖమ్మం జిల్లా, తల్లాడ సెప్టెంబర్ 01:** ద్విచక్ర వాహనాలకు సరియైన నంబర్ ప్లేట్, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. తల్లాడ లో మంగళవారం సరైన నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలు పాల్పడి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ సారంగపాణి పర్యవేక్షణలో ముమ్మర తనిఖీ చెప్పటారు. సరైన నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, సరైన నెంబర్ ప్లేట్లు తెచ్చుకొని అమర్చిన వాహనాలకు వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యంగా రోడ్లపై వాహనాలు నిలపడం ద్వారానే జరుగుతున్నాయని, అదేవిదంగా మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, రోడ్లపై తిరిగే వాహనాలకు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. పెండింగ్ ఛానళ్లు చెల్లించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న ట్రాఫిక్ నిబంధనలకు ప్రజలు సహకరించాలని కోరారు.



# మద్దికల్ గ్రామపంచాయతీలో వీధి దీపాల ఏర్పాటు



భీమారం మండలం,మద్దికల్ గ్రామ పంచాయతీ లో వీధి స్తంభాలకు సర్పంచ్ పోతెం సమ్మయ్య విద్యుత్తు బల్బులను ఏర్పాటు చేశారు. గ్రామంలోని వార్డులలో విద్యుత్ స్తంభాలకు పనిచేయని విద్యుత్ బల్బులను తీసేసి, వాటి స్థానంలో కొత్త విద్యుత్ బల్బులను అమర్చారు. గ్రామంలో చీకటిలో ప్రజలు ఇబ్బంది పడకుండా విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసిన సర్పంచ్ కు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

# కల్లడి గ్రామంలో చిరుతల సంచారంపై అవగాహన

### అటవీ ప్రాంతాల వైపు రాత్రివేళల్లో వెళ్లొద్దు.. అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఆలూర్ మండలం కల్లడి,చిన్నాపూర్ గ్రామాల పరిసర అటవీ ప్రాంతాల్లో చిరుతల సంచారం ఉన్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో కల్లడి గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చిరుతల సంచారం పై డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అశోక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రగత్, కల్లడి గ్రామ సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుతలు సంచరించే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో పశువులను ఒంటరిగా వదిలిపెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చిరుత కనిపించినా,పాదముద్రలు,ఇతర ఆనవాళ్లు గుర్తించినా ప్రజలు భయాందోళనలకు గురికాకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నల్లూర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన అధికారి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని నల్లూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎఫ్ ఎల్ ఎన్ స్పెషల్ ఆఫీసర్ రమేష్ పర్యవేక్షించారు.ఇందులో మూడవ తరగతి నాలుగో తరగతి విద్యార్థుల తెలుగు సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు.నెల వారి ప్రణాళిక బద్దంగా జరుగుతుందో లేదో,పాఠశాలలో విద్యార్థుల సౌకర్యాలను,పరిశీలించారు.వంటశాల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.సర్పంచ్ గంగాధర్,కార్యదర్శి,వార్డు సభ్యులు,పాఠశాల అభివృద్ధి కమిటీ,సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపల్లి కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు జామెంట్రీ బాక్సుల పంపిణీ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : ముప్కాల్ మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను తపాల కార్యాలయ రిటైర్డ్ ఉద్యోగి బి. మధుసూదన్ సందర్శించారు. పదవ తరగతి విద్యార్థినులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జామెంట్రీ బాక్సులు,లెక్కల పట్టికలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జి. వినోద, ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## టీజీ జెన్కో సిఎండి డా.ఎస్. హరీష్ హామీ





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 1(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యమైన మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని టీజీ జెన్కో సిఎండి డా.ఎస్. హరీష్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-142) రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. రామారావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంగళవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో టీజీ జెన్కో సీఎం డి డా. ఎస్. హరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎండి కు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీజీ జెన్కో లో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను యూనియన్ నాయకులు సిఎండి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యలను పరిశీలించి, త్వరలోనే సాధ్యమైన మేరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సిఎండి హామీ ఇచ్చినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. రామారావు తెలిపారు. అనంతరం టీజీ జెన్కో డైరెక్టర్ (హెచ్ఆర్) ఎస్.వి.కుమార్ రాజును కూడా యూనియన్ నాయకులు కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి. సత్యరాజ్ స్టీవెన్, ద్రాక్ష వేణు కుమార్, శ్రీధర్, చంద్రమోహన్, స్వామి తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం గారిని పరామర్శించిన గద్దల రమేష్

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 1(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్,ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ నాగరిగారి ప్రీతమ్ గారి తల్లి నాగరిగారి వసంత రాణి గారు అకాల మరణం చెందడంతో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ మంగళవారంలి హైదరాబాద్‌లోని చెంగిచెర్లలో ఉన్న వారి స్వగృహానికి వెళ్లి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం గారినీ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ పాల్వంచ టౌన్ ప్రెసిడెంట్ సదాశివ,నరేష్ తదితరులు పాల్గొన్నారు

# బాల్కొండ కే జీ బీ వి బాలికల పాఠశాలలో బాలికలకు కంటి పరీక్షలు

## కంటి చూపు లోపం ఉన్నవారిని గుర్తించి కళ్ల జోడు పంపిణీ చేసిన జిల్లా వైద్యాధికారి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం,రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం,జిల్లా అందత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో, అన్ని గురుకులంలో 6వ తరగతి నుండి 12 వ తరగతి వరకు ఉన్నటువంటి దాదాపు 52400 విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు.ఇందులో దాదాపు 4500 మంది విద్యార్థులకు కంటి చూపు లోపం ఉన్నట్లు గుర్తించారు.అందులో భాగంగానే మంగళవారం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం బాల్కొండలో కంటి చూపు లోపం ఉన్న పిల్లలకు కంటి అద్దాలను గౌరవ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. రాజశ్రీ పంపిణీ చేశారు.విద్యార్థులతో మాట్లాడి కంటి చూపు లోపాలు రాకుండా నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు సూచించారు.జిల్లా వ్యాప్తంగా కూడా కంటి చూపుతో గుర్తించబడిన విద్యార్థులకు కంటి అద్దాలను ఈరోజు నుండి ఉచితంగా అందించబడుతుంది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డీ ఐ ఓ డా;అశోక్,డీ ఈ డీ ఎమ్ హెచ్ ఓ డా, రవీందర్, వైద్యాధికారి, డా,స్రవంతి,ఆర్ బి ఎస్ కె వైద్యాధి కారి సూర్య నారాయణ,సాయి, సంతోష్, శ్రీనివాస్,భాగ్య కే జీ బీ వి ప్రిన్సిపల్ భవాని,పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణను బహిష్కరిస్తాం

## మాదిగ జాతి పేరుతో స్వార్థ ప్రయోజనాలకు పాల్పడుతున్న వారిని తీవ్రంగా ఖండిస్తున్నాం




**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 1(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** పాల్వంచలో సెప్టెంబర్ 4న నిర్వహించనున్న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు పాల్వంచ మండలానికి చెందిన మాదిగ సంఘం నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి మాదిగ జాతి తరఫున ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంగళవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. మాదిగ జాతి ఐక్యత, అభ్యున్నతి కోసం కాకుండా కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం పేరును ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గత కొంతకాలంగా వివిధ రాజకీయ పార్టీల వద్ద, అగ్రవర్ణాల వద్ద మాదిగ జాతి పేరును తాకట్టు పెడుతూ తమ ప్రయోజనాలు నెరవేర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాదిగ జాతి ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించబోమని నాయకులు హెచ్చరించారు. మాదిగ సమాజం పేరుతో జరుగుతున్న కార్యక్రమాల విషయంలో పారదర్శకత పాటించాలని, సమాజ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని కోరారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మాదిగ జాతి ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేసే విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో

# విద్యార్థినులకు కెరీర్‌కు పటిష్ట పునాది

## ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో మూడేళ్ల 'కెరీర్ రెడీనెస్' కార్యక్రమం ప్రారంభం



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 1(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** విద్యార్థినులు విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్ కెరీర్‌లో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, లాంచ్ గర్ల్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మూడేళ్ల కెరీర్ రెడీనెస్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో ప్రారంభించారు. రాష్ట్రంలోని 43 ప్రభుత్వ డిగ్రీ, అటానమస్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినుల కోసం రూపొందించిన ఈ కార్యక్రమాన్ని 2026--27 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం విద్యార్థినులతో ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు మొదటి సంవత్సరం నుంచే కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించి, ఉన్నత విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలను అందించనున్నారు. ఈ సందర్భంగా లాంచ్ గర్ల్స్ ప్రోగ్రామ్ అసోసియేట్ ప్రియాంక విద్యార్థినులకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, ఆర్థిక అవగాహన, డిజిటల్ లిటరసీ, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కేవలం ఉద్యోగానికి సిద్ధం చేయడం కాకుండా నాయకత్వ లక్షణాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, ప్రాయోగిక పరిజ్ఞానం పెంపొందించడం ద్వారా విద్యార్థినులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన నిపుణుల ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల పాటు వివిధ దశల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కళాశాల మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా. జె.మాధవి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కెరీర్ రెడీనెస్ కార్యక్రమ ఫ్యాకల్టీ సభ్యులు డా.ఎన్.శ్రీదేవి, ఎస్. విమల,ఎ. హారిక, కరీమా తబస్సుమ్ కార్యక్రమ నిర్వహణలో సహకరించారు.

# కేత రమణారావుకు రూ.66 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు మండలం, సెప్టెంబర్ 1 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : మణుగూరు మండలం శేషగిరినగర్ గ్రామానికి చెందిన కేత రమణారావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.66 వేల విలువైన రెండు చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. చెక్కులు అందుకున్న కేత రమణారావు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పిప్రి జే గ్రామంలో గుంతల మయమైన రోడ్లపై మరమ్మతులు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** భీంగల్ మండలంలోని పిప్రి (జే) గ్రామంలో సర్పంచ్ జనార్ధన్ ఆధ్వర్యంలో గుంతల మయమైన రోడ్లపై మరమ్మత్తులు చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో స్కూల్ పిల్లల పట్ల, వాహన దారుల పట్ల ఇబ్బందులను గమనించిన సర్పంచ్ తక్షణ చర్యలు చేపట్టారు. చిప్స్ వైట్ మిక్స్ వంటి వాటితో రోడ్లపై గుంతలను పూడ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రంజిత్, వి డి సి సభ్యులు, జిపి సిబ్బంది పాల్గొన్నారు.

# మారెళ్లపాడు లిఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**అశ్వాపురం మండలం, సెప్టెంబర్ 1, పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం లిఫ్ట్ కెనాల్ పనుల పురోగతిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న కెనాల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో చేపట్టాలని, పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే రైతులకు సాగునీటి అందుబాటు మరింత మెరుగుపడి, వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, మండల ముఖ్య నాయకులు జిల్లా ముఖ్య నాయకులు సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నాగంపేట్ గ్రామ నూతన గ్రామ పంచాయతీ భవనానికి స్లాబ్ నిర్మాణ కార్యక్రమం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి మంగళవారం స్లాబ్ పనులు చేపట్టారు.నూతన గ్రామపంచాయతీ భవనం పట్ల ప్రజల తీవ్ర సంతృప్తి వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గంగాధర్, ఉప సర్పంచ్ మదన్ కుమార్,ఎం పి మధుకర్ మధుకర్, పీ అర్,ఏ ఈ రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత,వార్డు సభ్యులు, ప్రజలు, కాంట్రాక్టర్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డి, మొక్కల తొలగింపు



**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 1 :** భీమారం మండలం, కొత్తపల్లి గ్రామపంచాయతీలో గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డి, పిచ్చి మొక్కలు, రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. గ్రామంలో పారిశుద్ధ్యము పరిశుభ్రత లో భాగంగా సర్పంచ్ దుర్గం తిరుపతి ఆధ్వర్యంలో ట్రాక్టర్ బ్లేడ్ తో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డి, మొక్కలను తొలగించారు. ఉప సర్పంచ్ దుర్గం జనార్ధన్, ఆకుదారి శంకర్ పర్యవేక్షించారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి




**పోరు తెలంగాణ,ఖమ్మం :** సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, గరిష్ఠ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్ డా. జి.వి. మహేష్ నాథ్ సూచించారు. జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో ఖమ్మం యూనిట్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను ముందుగానే గుర్తించి, సంబంధిత కక్షిదారులను లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి, వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మనస, ఖమ్మం యూనిట్‌కు చెందిన ఎస్‌హెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామంలోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 15 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు.లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, కార్యదర్శి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 1, 2026:** భూ వివాదాల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమిని మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియపై మండల తహసిల్దార్, సర్వేయర్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే చేసిన విస్తీర్ణానికి సంబంధించి కొ-రిలేషన్ స్టేట్‌మెంట్‌ను పూర్తి చేయాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా ఎలాంటి జాప్యం లేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ

హియరింగ్ ప్రక్రియకు సహకరించాలని ఆదేశం....

జిల్లా కలెక్టర్ కె. హరిత



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసులు జారీ చేసి చేపడుతున్న హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో నోటీసులు, రిజిస్టర్లు, ఓటర్ల ధ్రువపత్రాలను ఆమె పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుండి ధ్రువపత్రాలు స్వీకరించి బూత్ స్థాయి అధికారి యాప్‌లో నమోదు చేయాలని, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి నోటీసులు అందజేసి రసీదులు తీసుకోవాలని సూచించారు. పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హియరింగ్ ప్రక్రియకు ఓటర్లు హాజరై ధ్రువపత్రాలు సమర్పించేలా పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని కోరారు. నివాస ధ్రువపత్రాలు తహసీల్దార్ కార్యాలయాల నుండి త్వరగా జారీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

# బెజ్జూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

ఆదివాసి బిడ్డకు న్యాయం చేయాలని డిమాండ్.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం సోమిని గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసి బాలిక శిరీషపై జరిగిన ఘటనను ఆదివాసి విద్యార్థి సంఘం బెజ్జూర్ మండల అధ్యక్షుడు తొర్రెం ప్రశాంత్ దొర తీవ్రంగా ఖండించారు. అగ్రవర్ణాలకు ఒక న్యాయం, ఆదివాసీలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఇంతటి ఘటన జరిగినా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సంఘాలు స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వరంగల్‌లో ఆసిడ్ దాడి కేసులో, హైదరాబాద్ దిశ కేసులో నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన తీరులోనే ఈ ఘటనలో నిందితుడిని కూడా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై నిష్పక్షపాతంగా, వేగంగా విచారణ జరిపించి నిందితులకు కఠినమైన శిక్ష విధించాలని కోరారు. ఆదివాసి బిడ్డకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెపై పులి దాడి రైతుకు నష్టం



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అనుకోడ గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం గొర్రెలు మేపుతున్న రైతు బైరి అంకుల్ గొర్రెపై పులి దాడి చేసి చంపింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలికి చేరుకుని పులి దాడిగా నిర్ధారించారు. చనిపోయిన గొర్రె విలువ సుమారు రూ.12--13 వేలు ఉంటుందని అంచనా. పులి సంచారంతో గ్రామంలో రైతులు, పశు పోషకులు ఆందోళనలో ఉన్నారు. నష్టపరిహారం అందించాలని బాధిత రైతు అటవీశాఖ అధికారులను డిమాండ్ చేశాడు

# ట్రాన్స్‌జెండర్స్‌కు స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి

పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**పోరు తెలంగాణ,ఖమ్మం, సెప్టెంబర్ 1:** ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో అందరితో సమానంగా గౌరవంగా జీవించేలా, వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రయత్నాలు చేస్తామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు, జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. సమాజంలో గౌరవప్రదంగా, స్వయం ఆధారంగా జీవించేందుకు అవసరమైన ఉపాధి అవకాశాల కల్పనకు పోలీస్ శాఖ తరపున సహకారం అందిస్తామని కమిషనర్ తెలిపారు. అదే సమయంలో శుభకార్యాలు, వివాహాలు, ఇతర కార్యక్రమాలకు వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాన్స్‌జెండర్స్‌పై ఉన్న వివక్షను తొలగించి, వారు సమాజంలో గౌరవంగా, సొంతంగా జీవించేలా జీవనోపాధి అవకాశాల కోసం పోలీస్ అధికారులు ప్రయత్నాలు చేస్తామని చెప్పడం సానుకూల పరిణామమని పలువురు ట్రాన్స్‌జెండర్స్ హర్షం వ్యక్తం చేశారు.ద

## హామీల అమలుకు కార్యాచరణపై వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం



**కామారెడ్డి ప్రతినిధి ; సెప్టెంబర్ 01 (పోరు తెలంగాణ న్యూస్);** వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 5న ఖమ్మంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కోల బాలరాజ్ గౌడ్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. హామీల సాధన కోసం చేపట్టాల్సిన పోరాటం, భవిష్యత్ కార్యాచరణపై ఖమ్మంలో జరిగే సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. వికలాంగుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 5న ఖమ్మంలో జరిగే సమావేశానికి కామారెడ్డి జిల్లాకు చెందిన దివ్యాంగ మిత్రులు, ముఖ్య కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోల బాలరాజ్ గౌడ్ కోరారు.

# కలెక్టర్ దివాకర టి.ఎస్.ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేసిన ఎమ్మెల్యే

వైరా నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చలు

**పోరు తెలంగాణ,ఖమ్మం, సెప్టెంబర్ - 01:** సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కోరారు. ఖమ్మం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ ను దివాకర టి.ఎస్ ను వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అభివృద్ధి పనులు, రైతుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు చక్కెర కిరోసిన్ పంపిణీ చేయాలి

శివ సాయి మండల వినియోగదారులలి సంఘం ప్రతినిధుల వినతి...



**కామారెడ్డి ప్రతినిధి ; సెప్టెంబర్ 1 (పోరు తెలంగాణ న్యూస్) ;** రేషన్ వినియోగదారులకు సన్న బియ్యంతో పాటు చక్కెర, కిరోసిన్లను సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేయాలని దోమకొండ మండల వినియోగదారుల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం స్థానిక డిప్యూటీ తాసిల్దార్ బిక్షపతి కి వినతిపత్రం అందజేశారు. గతంలో రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు హిరోషిన్ చక్కెర గోధుమలు పామాయిల్ సబ్సిడీలపై పంపిణీ చేసేవారు .ప్రస్తుత పరిస్థితులలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక చక్కని నలభై రూపాయల కేజీ ఉన్న చక్కెర ఒకేసారి 80 రూపాయలకు పెరగడంతో ఉదయం చాయో పాలు తాగలేని పరిస్థితిలో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రేషన్ షాపులో ద్వారా సన్న బియ్యంతో పాటు చక్కెర కిరోసిన్ గోధుమలు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేయాలని వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు బండారు శంకర్ ఉపాధ్యక్షులు జంగం చంద్రమౌళి కార్యదర్శి బొమ్మెర బాలయ్య, కోశాధికారి సామల లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు వల్మాటి నరేష్, సాప విజయ్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; సెప్టెంబర్ 01 (పోరు తెలంగాణ న్యూస్);** రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, సామాజిక రుగ్మతలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు జిల్లా సబ్ డివిజనల్ పోలీస్ అధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మధుసూదన్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైనట్లు గుర్తిస్తే గంటలోపు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎవరికీ ఓటీపీ వివరాలు చెప్పవద్దని, బ్యాంకు అధికారులు లేదా పోలీసు అధికారులు కూడా ఓటీపీ వివరాలు అడగరని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుళ్లు రామంచ తిరుపతి, యు. శేషరావు, పోలీసు కానిస్టేబుల్ ప్రభాకర్ మాటలు, పాటల ద్వారా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ నరహరి, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ట్రాఫిక్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఆర్ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మూడు నెలలంటూ జోస్యం వెయ్యి రోజులతో జవాబు!

బీఆర్ఎస్ నేతల రాజకీయ లెక్కలకు కాలమే కౌంటర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 1** : "కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండదు" అంటూ గతంలో జోస్యం చెప్పిన బీఆర్ఎస్ నేతల మాటలకు వెయ్యి రోజుల ప్రజాపాలన సమాధానంగా నిలిచిందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని లెక్కలు వేసిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌కుమార్‌ల రాజకీయ అంచనాలు ఎక్కడ తారుమార య్యాయో ఆలోచించుకోవా లని ఆయన ఎద్దేవా చేశారు. మూడు నెలలు కాదు.. వెయ్యి రోజులు పూర్తయ్యాయి.. ఇంకా 825 రోజులు ప్రజల తీర్పుతో ముందుకు సాగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అధికారంలోకి రాకముందు ఒక లెక్క.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో లెక్క.. ప్రజల మధ్య నిలబడాల్సిన సమయంలో ఇంకో లెక్క అంటూ బీఆర్ఎస్ నేతల తీరుపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా అని ఎదురుచూడటం మానేసి.. ప్రజలు ఎందుకు బీఆర్ఎస్‌ను తిరస్కరించా రో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన -- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని రంజిత్‌రెడ్డి సవాల్ విసిరారు.

# తహాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 1** : ఈరోజు 01.09.2026 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలని రాష్ట్ర టీజేఏసీ పిలుపుమేరకు నెక్కొండ తాసిల్దార్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టీజేఏసీ నాయకులు డిటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి జాన్ నాయక్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు అయినా రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయపరంగా , రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 2వ పిఆర్సిని జాప్యం లేకుండా ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 6 డి ఏ లను వెంటనే ఇప్పించాలని, 10,000 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ఈ హెచ్ ఎస్ విధివిధానాలను ప్రకటించి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు ఈ నిరసనలో భాగంగా జేఏసీ నాయకులు పాక శ్రీనివాస్, డి కుమారస్వామి, బాలాజీ, సురేష్,రవి, శ్రీధర్ గౌడ్,ఎంపీ ఓ దయాకర్, సదానందం, జోగయ్య, చైతన్య, జోష్ణ, రాజ్ కుమార్, దయాకర్ రాజేష్, కృష్ణ, శ్రావణ్, కొమ్మాలు తదితర ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెక్కొండ మండలం పామ్ ఆయిల్ రైతుల అసోసియేషన్ కమిటీ ఎన్నిక



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 1 :** ఈరోజు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెక్కొండ మండల అధ్యక్షునిగా సిరిపోతుల సురేష్, ఉపాధ్యక్షులు తిప్పని రమేష్, శ్యామల వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి నల్లగొండ సాంబరాజు కోశాధికారి చీపతి రమేష్ కార్యవర్గ సభ్యులు అనుముల ధర్మారెడ్డి, అందే వీరస్వామి, గై రవికుమార్ లను జిల్లా పాలకవర్గ సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది, మరియు నూతనంగా మన నెక్కొండ మండల నుండి జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్నికైన యాసం కుమారస్వామి నీ కూడా ఎన్నుకోవడం జరిగింది

# ఊకె శిరీష కుటుంబానికి అండగా తెలంగాణ ప్రభుత్వం

పినపాక ఎమ్మెల్యే పాయం

విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



**ములకలపల్లి, సెప్టెంబర్ 1, పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ హాస్పిటల్‌లో నర్సుగా విధులు నిర్వహిస్తూ అత్యాచారానికి గురై హత్య చేయబడిన విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. శిరీష స్వగ్రామమైన చౌటుగూడెంలోని ఆమె నివాసానికి వెళ్లిన లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు పాయం తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. శిరీషపై జరిగిన దారుణ ఘటనపై లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లి తీవ్ర విచారం, ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే హత్యకు గురికావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం, మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ఊకె శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి వారికి అన్ని విధాలుగా అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు, పాయం జారేఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తామని, వారికి అవసరమైన సహాయ సహకారాల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

# ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

రోగుల నుంచి డబ్బులు ఆశించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తాం

మెరుగైన వైద్య సేవలతో ఎన్టీపీసీ, చెన్నూరు నుంచి కూడా జిల్లా ఆసుపత్రికి వస్తున్న ప్రజలు

జిల్లా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**పోరు తెలంగాణ ప్రతినిధి//పెద్దపల్లి** : ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.చిన్నపిల్లల వార్డు, గర్భిణీల వార్డు, ఎక్స్‌రే గది, ఔట్‌పేషెంట్ విభాగం, చికిత్స విభాగం, డెంటల్ విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్స్ తదితర అన్ని విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, వారి సహాయకుల నుంచి కలెక్టర్ నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వైద్యం, మందుల లభ్యత, పారిశుధ్యం, సిబ్బంది వ్యవహారశైలిపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ఎన్టీపీసీ, చెన్నూరు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వైద్యం కోసం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నారనే ఫిర్యాదులు తరచుగా వస్తున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రోగుల నుంచి స్వీకరించిన ఫీడ్‌బ్యాక్‌ను పరిశీలించి, ఫిర్యాదులు నిజమని తేలితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి ఎలాంటి రూపంలోనూ డబ్బులు ఆశించరాదని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు. రోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం, ఆశించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు.పారిశుధ్య సిబ్బంది తమ పనితీరును మార్చుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై కూడా రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిని విధుల నుంచి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవల నాణ్యత, రోగుల సంతృప్తిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. కలెక్టర్ వెంట డిజిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంతకూ ధర్మాసనం ఎందుకు




గవర్నర్లు బిల్లుల ఆమోదంపై కాలపరిమితిని పాటించకపోవడం రాజ్యాంగ సమస్యగా మారింది. రాష్ట్రపతి 14 కీలక ప్రశ్నలతో సుప్రీంకోర్టును సందర్శించడంతో, పాలనా జాప్యాలపై చర్చ మరింత తీవ్రతరమైంది. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, కేంద్ర రాష్ట్ర కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళు, పరిపాలన సంబంధిత నిబంధనల నిర్వహణ... ఇవన్నీ ప్రజలకు తక్షణం పరిష్కారం కావాల్సిన అవసరాలు. ఇటీవల బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితిని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఇది కొత్త ఆలోచన కాదు. హోంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల్లోనే ఉంది. హోంమంత్రిత్వ శాఖే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో బిల్లుల ఆమోదంపై గడువును నిర్ణయించాలని అన్నది. ?ఇప్పుడు మళ్లీ సుప్రీం తీర్పుపై వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. గడువు అవసరాన్ని ప్రభుత్వమే ఒప్పుకున్న తర్వాత మరలా ఆ గడువుకు సంబంధించిన తీర్పు మీదనే సుప్రీంకోర్టుకే 14 రెఫరెన్స్‌లు ఎందుకు? అందుకోసం సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇటూ అటూ లాయర్లు సుదీర్ఘ కాలం నడిపిస్తారు. చివరకు సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, "మాకిష్టం లేదు. మేం ఒప్పుకోం," అనే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలోనే మనం రాసుకున్నాం. అలాంటప్పుడు ఇదంతా వృథా కాదా? 2024 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో: "మేము కేవలం హోం మంత్రిత్వ శాఖ 2016లో జారీ చేసిన మెమొరండమ్ రూపంలోని మార్గదర్శకాలను అనుసరిస్తున్నాం, అవి మూడు నెలల గడువును సూచించాయి" అని పేర్కొంది. అంటే ఈ కాల పరిమితిని మొదట కేంద్ర ప్రభుత్వమే సూచించింది. అటువంటప్పుడు మళ్ళీ సుప్రీంకోర్టు విచారణ అవసరం ఎందుకు? భారత రాష్ట్రపతి దేశ పాలనలో రాజ్యాంగ అత్యున్నత పదవిలో ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నిక కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటింగ్ చేస్తారు. దేశవ్యాప్తంగా అత్యంత విశాలమైన ప్రజాతంత్ర ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ఆ పదవికి గౌరవం. గవర్నర్లను రాష్ట్రపతి ద్వారా ప్రధానమంత్రి, మంత్రివర్గ సిఫార్సు మేరకు నియమిస్తారు. ఇది ఎన్నిక కాదు. వారు చేసే ఎంపిక. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లకు అత్యున్నత పరిపాలనాధికారాలు ఉంటాయి. వాటిని దుర్వినియోగం చేయకూడదు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కానీ ఇది జరగటం లేదు. ఇది కేవలం తమిళనాడు సమస్యేకాదు, ఎన్డీయేతర రాష్ట్రాలన్నిటిలోనూ ఈ సమస్య ఉంది. ఆర్టికల్ 200, 201లో కాల పరిమితులు లేకపోవటం తప్పుగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ పరిపాలనలో సమయానుకూల నిర్ణయాలు కీలకం. గవర్నర్లు ఈ బాధ్యతను విస్మరించరాదు. తాము సంప్రదాయ పరిపాలనా అధికారం కలిగినప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం చేయకూడదు. సుప్రీంకోర్టు తీర్పు అందరు గవర్నర్లకు వర్తిస్తుంది. గవర్నర్ ముఖ్యమంత్రుల మధ్య ప్రతి రాష్ట్రంలోనూ గొడవ ఉండదు. కేంద్రంలో రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆలస్యాలు కావాలని చేస్తున్నట్టు కనపడుతూనే ఉంది. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోలేక పరిపాలన స్తంభించిపోతున్నది. తమిళనాడు వెర్సస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025) కేసులో గవర్నర్ 'పాకెట్ వీటో' వాడుతున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. 'పాకెట్ వీటో' అంటే బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచటం. రాష్ట్రపతి వేసిన ఐదు కీలక ప్రశ్నలు ఇవే: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అధికారాలు న్యాయపరంగా పరిశీలించదగినవేనా? 2) ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్/ రాష్ట్రపతి పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతమా? 3) రాజ్యాంగ కాలపరిమితి లేకపోతే గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం ఏ విధంగా జరగాలి? 4) ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి చేసే నిర్ణయాలు న్యాయపరంగా సమీక్షించదగినవేనా? 5) ఆర్టికల్ 201 ప్రకారం బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధించవచ్చా? ఉందనుకుంటే సుప్రీంకోర్టు గడువులు ఇవ్వవచ్చా? రకరకాల అనుమానాలు: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కి నిర్ణయాల విచక్షణాధికారాలు ఉన్నాయా? గవర్నర్ రాష్ట్ర కేబినెట్ సలహా మేరకే పనిచేయాలా? అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చా? 2) ఆర్టికల్ 142 ప్రకారం కోర్టులు గవర్నర్/ రాష్ట్రపతిని తొలగించే ఆదేశాలు ఇవ్వగలవా? 3) గవర్నర్ అంగీకారం లేకుండా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం చట్టబద్ధమా? 4) ఈ అంశంపైన ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సిన అవసరముందా? 5) ఆర్టికల్ 131 ప్రకారం ఒరిజినల్ సూట్ లేకుండా కేంద్రం రాష్ట్రాల మధ్య విభేదాలను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా? న్యాయమూర్తి పార్థివాలా అభిప్రాయం ప్రకారం గవర్నర్‌కు ఒక బిల్లు వచ్చాక... మూడు మార్గాలు మాత్రమే ఉంటాయి. ఒకసారి బిల్లు తిరిగి శాసనసభకి పంపి, అదే రూపంలో తిరిగి వస్తే రాష్ట్రపతికి పంపించే హక్కు గవర్నర్‌కు ఉండదు. ఆయన సూచనల మేరకే మార్పులు జరిగితే తప్ప. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లులపై జాప్యం చేస్తే ఆ ప్రభుత్వాలు కోర్టులో మాండమస్ రిట్ వేయవచ్చు. బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు తీర్పు దిశను సూచించినప్పటికీ, తుది స్పష్టత కోసం రాజ్యాంగ ధర్మాసనం అవసరమే. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ఇది ప్రజల పాలనపై హక్కును దారుణంగా ఉల్లంఘించటమే.

# సత్యాసత్యాలుజి



పాకిస్తాన్‌పై భారత్ చేసిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం జరిగిందని చౌహాన్ ఒప్పుకున్నారు. విమానాలు కోల్పోయిన విషయంపై స్పష్టత ఇవ్వకపోయినా, వ్యూహాలను మెరుగుపరచామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌పై ఇటీవల జరిపిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం వాటిల్లిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ అంగీకరించారు. భారత్‌కు చెందిన ఆరువిమానాలను కూల్చేశానని పాకిస్థాన్ చెప్పడం శుద్ధ అబద్ధమని అంటూనే, ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందో ఇదమిత్థంగా చెప్పకుండా త్రిదళాధిపతి ఈ యుద్ధానికి సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. విమానాలు కోల్పోవడం కంటే, ఎందుకు, ఎలా జరిగిందన్న కారణాలు తెలుసుకోవడం ముఖ్యం కనుక, వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకొని, వ్యూహాలను మెరుగుపరుచుకొని అమలు చేశామని అన్నారాయన. ఆదిలో వేసిన ఈ తప్పుటడుగులవల్ల ఒనగూరిన నష్టమెంతో చెప్పలేదు కానీ, సరిదిద్దుకున్న అనంతరం పాకిస్థాన్‌ను అద్భుతంగా దెబ్బతీయగలిగామన్నారు. ఎంతో కచ్చితత్వంతో పాక్ స్థావరాలపై దాడులు చేయడంతో వాటిని ఆపాల్సిందిగా ఆ దేశం ప్రాధేయపడిందని ఆయన వివరించారు. చైనా చేయూతతో భారత్‌ను పాకిస్థాన్ గట్టిదెబ్బ కొట్టిందన్న ప్రచారం ఉధృతంగా జరిగిన నేపథ్యంలో, అసలు చైనా సమకూర్చిన రక్షణవ్యవస్థలు సరిగా పనిచేయనేలేదని కూడా ఆయన గాలి తీసేశారు. విపక్షాలకు చౌహాన్‌వ్యాఖ్యలు మంచి మందుగుండు సమకూర్చాయి. మోదీ సర్కారు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నదనీ, గుట్టు విప్పడం లేదు, నిజం చెప్పడం లేదు అంటూ ఆదినుంచీ ఆగ్రహిస్తున్న విపక్షాలు ఇప్పుడు మళ్ళీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేస్తున్నాయి. ఎన్ని విమానాలు?, ఏమిటవి అన్న ప్రశ్నలతో పాటు చాలా అనుమానాలు నివృత్తిచేసుకోవాలని, అమెరికా అధ్యక్షుడు ఒకటికి పదిసార్లు వాణిజ్యం బూచి చూపి తానే యుద్ధం ఆపానంటూ బల్లగుద్దుతున్న సంగతీ మాట్లాడుకోవాలని అవి అంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో ఉన్నదేమిటో జనానికి తెలియనక్కరలేదా? అన్నది మంచిప్రశ్న. ఇప్పటివరకూ పొరుగుదేశం చెబుతున్న గొప్పలను, లెక్కలను సహజంగానే నమ్మకపోవడంతో పాటు, అంతర్జాతీయ మీడియానూ, రక్షణరంగ విశ్లేషణలను సైతం భారతీయులు అనుమానించారు. పాక్‌మీద ప్రేమతో పాశ్చాత్యదేశాలన్నీ అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని భావించారు. కానీ, యుద్ధం ముగిసిన మూడువారాల తరువాత చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యంతో పాటు కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. యుద్ధం అన్నాక నష్టాలు సహజం అని అప్పట్లో ఎయిర్‌మార్షల్ భారతి, ఇప్పుడు చౌహాన్ ప్రత్యేకంగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఏమీ లేదు. పోరాటంలో నెగ్గడంతో పాటు, పోగొట్టుకోవడం కూడా ఉంటుందని సామాన్యుడికి సైతం తెలుసు. అయితే, ఐదువిమానాలను కూల్చినట్టుగా పాక్ తొలిరోజునే చేసిన ప్రకటనను వమ్ముచేయడానికి కాబోలు, వాయుసేన పైలట్లందరూ సురక్షితంగా తిరిగివచ్చారని చెప్పి వైమానిక నష్టాలేమీ జరగలేదన్నట్టుగా ఎయిర్‌మార్షల్ దేశప్రజలకో అభిప్రాయాన్ని కలిగించారు. సరికొత్త ఒప్పందంతో, ఫ్రాన్స్‌నుంచి మరింత ఖరీదుకు కొనుక్కున్న రాఫెల్‌కు అప్రదిష్ట రాకూడదన్న జాగ్రత్త అందులో ఉండివుండవచ్చు. ఇప్పుడు సీడీఎస్ చౌహాన్ పాకిస్థాన్ అంటున్న స్థాయిలో కాకున్నా నష్టం అధికంగానే సంభవించిందని తేల్చేశారు. యుద్ధకాలంలో పాక్ పని అయిపోయిందంటూ ఎన్నిరకాల ప్రచారాలు జరిగాయో, అందులో బీజేపీ నాయకులు ఎంత ముందున్నారో అందరికీ తెలుసు. ఆ ఉద్వేగాల మధ్య, మరోపక్క పాకిస్థాన్ దీనికి ప్రతిగా, ప్రతీకారంగా మరింత విషప్రచారం సాగించిన నేపథ్యంలో, వాస్తవిక స్థితిని చెప్పడానికి సైన్యం కత్తిమీద సాముచేయాల్సివచ్చింది. అయితే, సత్యాన్ని దాచడంవల్లనో, అర్ధసత్యాలు చెప్పడం వల్లనో అసత్యప్రచారాలను వమ్ముచేయడం సాధ్యంకాదు. దేశం కోసం ప్రాణాలకు తెగించిపోరాడే సైన్యానికి రాజకీయాలతో నిమిత్తం లేదు కనుక, ఉన్నదివున్నట్టు చెప్పడానికి ఏ దశలోనూ సందేహించనక్కరలేదు. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌కు తీరని నష్టం చేశామని, ఉగ్రస్థావరాలను కుప్పకూల్చి ఒక కొత్త లక్ష్మణరేఖ గీశామన్నది వాస్తవం. జాగ్రత్తగానైనా కొన్ని నిజాలు విప్పినందుకు చౌహాన్‌ను అభినందించాల్సిందే. అయితే, మూడువారాల తరువాత కూడా అది 145కోట్లమంది దేశప్రజల సమక్షంలో గాక, కఠినమైన ప్రశ్నలు, విశ్లేషణలు ఎదుర్కొనే సందర్భంలో, ఒక విదేశీ వేదికమీద జరగడం కాస్తంత అసంతృప్తిని కలిగిస్తున్న మాట నిజం.

# సూర్యాపేట ఘటనలు ప్రభుత్వానికో హెచ్చరిక

సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలతో జరిగిన అమానవీయ ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. అనుమతులేని ఆసుపత్రులు, అవినీతిలో కూరుకుపోయిన అధికారుల వల్ల ఇద్దరి ప్రాణాలు నష్టపోయాయి. ఇటీవల సూర్యాపేటలో వెలుగుచూసిన వరుస ఘటనలతో రాష్ట్రం నివ్వెరపోయింది. ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఓ స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. మూడోసారీ ఆడపిల్లే పుట్టబోతోందని తెలిసి, నెలల గర్భవతిగా ఉన్న ఓ మహిళ ఆబార్షన్‌కు సిద్ధపడింది. కాసులకు కక్కుర్తిపడిన ఓ ఆర్ఎంపీ ఆమెను పట్టణంలో అనుమతుల్లేని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. సదరు ఆస్పత్రి నిర్వాకం వల్ల ఆ గర్భవతి మృతి చెందింది. ఇక్కడి వరకూ ఓ కథ. అంతకు కొద్దిరోజుల ముందు అదే సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ స్కానింగ్ సెంటర్ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత ఆ కేసు నుంచి తప్పించేందుకు నిందితుడిని స్థానిక డీఎస్పీ, సీఐ రూ.25 లక్షలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు! నిబంధనలను పాతరేసిన స్కానింగ్ సెంటర్, అనుమతులు లేని ఆసుపత్రి, సమాజాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారులు అవినీతికి పాల్పడడం, ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులు ప్రజల ప్రాణాలను హరించడం లాంటి అమానుష ఘటనలు సభ్య సమాజంలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న స్కానింగ్ సెంటర్లకు, ఆసుపత్రులకు అనుమతులు ఉన్నాయా? ఉంటే అవి నిబంధనలకు లోబడే పని చేస్తున్నాయా? ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు సరైన అర్హతలు ఉన్నాయా? అనుమతులు లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోడానికి వైద్య ఆరోగ్యశాఖ ఎందుకు వెనుకాడుతోంది? అనుమతి లేని స్కానింగ్ సెంటర్ వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడిన డీఎస్పీ, సీఐ వ్యవహారం బయటకు వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ స్పందించి ఉండాల్సింది. అనుమతులు లేని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ అమానవీయ ఘటన జరిగేది కాదు. కేవలం వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే రెండు ప్రాణాలు బలయ్యాయి. తల్లిని కోల్పోయిన ఇద్దరు అమ్మాయిల భవిష్యత్తుకు భరోసా ఎవరు? రాష్ట్రంలోని పలు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులు గర్భస్థ లింగ నిర్ధారణ, పిండ విచ్ఛిన్న కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇవి గ్రామస్థాయి వరకు దళారులను నియమించుకొని లింగ నిర్ధారణ పరీక్షలతో వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ తల్లీ బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మామూళ్లకు అలవాటుపడిన వైద్యాధికారులు సదరు ఆసుపత్రుల జోలికి వెళ్ళడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట ఘటనలను ఓ హెచ్చరికగా తీసుకుని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ నిరంతరం నిఘా పెట్టాలి. భ్రూణ హత్యల నిరోధక చట్టాన్ని అతిక్రమించిన వైద్యులను కఠినంగా శిక్షించాలి.



## రోడ్డు పనులను పరిశీలించిన

# ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, సెప్టెంబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మంఖాల్ నుండి హర్షగూడ గ్రామానికి వెళ్ళే రోడ్డు పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులుగా మారిన హర్షగూడ నుండి మహేశ్వరం సిసి రోడ్లు పనులను త్వరగా చేపట్టాలని ఆమె తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనులకు రాజకీయాలకతీతంగా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హర్షగూడ గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి కృషి చేస్తుండడంతో హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్ ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హర్షగూడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నెక్కొండ పీహెచ్సీ ని సందర్శించిన ఉన్నతాధికారులు



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 1 :**ఈరోజు నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈరోజు డిప్యూటీ డిఎంహెచ్వో డా. ప్రకాశ్ సార్ మరియు ఎన్ టి ఈ పి ఓ పి డా. అరుణ్ జోషి సార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇచ్చార పీహెచ్సీ లోని రిజిస్టర్లను పరిశీలించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో సాధించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

# అరుణవర్ణమైన ఢిల్లీ

–ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి భారీగా తరలిన సిపిఐ శ్రేణులు




**పోరు తెలంగాణ,ఖమ్మం సెప్టెంబర్ 01:** బస్తావ్ జరూరీ హై పేరుతో సిపిఐ మంగళవారం నిర్వహించిన బహిరంగ సభతో ఢిల్లీ అరుణవర్ణాన్ని –సంతరించుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలి రాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో –సిపిఐ కార్యకర్తలు బహిరంగ సభకు హాజరయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి హాజరైన కార్యకర్తలు ఢిల్లీలో వేరువేరుగా ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జిల్లా ప్రదర్శనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి లు నేతృత్వం వహించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రదర్శనకు జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా నేతృత్వం వహించారు. రాంలీల మైదానం ఉదయం 10గంటలకే నిండిపోయింది. సభకు ఆశించిన దాని కంటే అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడం ముఖ్యంగా యువత, మహిళలు ఎక్కువగా తరలి రావడంతో సిపిఐ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపింది. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు ఈ బహిరంగ సభ అద్దంపట్టిందని ఆయన తెలిపారు. మోడీ ప్రభుత్వాన్ని మార్చడానికి సిపిఐ పూరించిన సమర శంఖారావం విజయవంతమైందని, రానున్న కాలంలో మరిన్ని ప్రజా ఉద్యమాలను నిర్మించనున్నట్లు హేమంతరావు తెలిపారు.

# కుట్టు మిషన్ల పంపిణీలో వికలాంగ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి - కొత్వాల రమాదేవి



**పోరు తెలంగాణ ప్రతినిధి, నెక్కొండ, సెప్టెంబర్ 1:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళల స్వయం ఉపాధి కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో వికలాంగ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని వికలాంగుల మహిళా విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కొత్వాల రమాదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ, బీసీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో వికలాంగ మహిళలను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. వికలాంగ మహిళలు శారీరక పరిమితుల కారణంగా బయటకు వెళ్లి పనులు చేసుకోలేక, ఇంటి వద్దనే కుట్టు మిషన్ పై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారని, వారికి కుట్టు మిషనే జీవనాధారమని ఆమె తెలిపారు. కాబట్టి సంక్షేమ పథకాల అమలులో భాగంగా కుట్టు మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి వికలాంగ మహిళకు కుట్టు మిషన్ అందించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు వికలాంగ మహిళల తరపున వినతి పత్రం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.